
సాక్షి ఒడిశా
సోమవారం ၊ 23 ၊ జనవరి ၊ 2023




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,41,290లు, బంగారం 28 గ్రాములు, వెండి 16 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



విద్యతోనే వికాశం సాధ్యం

- 8లో



కొత్త సూర్య దేవాలయం నిర్మాణానికి సన్నాహాలు

- 8లో

న్యూస్‌రీల్

మోడల్ అర్కిత ఆత్మహత్య!



అర్కిత మహాపాత్రో(ఫైల్)

బరంపురం: ఆర్థిక సమస్యలతో నగరానికి చెందిన మోడల్ అర్కిత ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం బరంపురం పెద్ద బజార్ పోలీసు స్టేషన్ పరిధి జగన్నాథ్ విహార్ 2వ లైన్‌లో నివాసం ఉంటున్న బిష్ణు ప్రసాద్ మహాపాత్రో రెండో కుమార్తె, మోడల్ అర్కిత మహాపాత్రో ఇంట్లోనే శనివారం రాత్రి ఉరి వేసుకొని, బలవన్మరణానికి పాల్పడింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టు మార్టం నిమిత్తం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అలాగే అర్కిత తన స్వహస్తాలతో రాసిన లేఖను స్వాధీనం చేసుకుగా, తన మరణానికి ఎవరూ కారణం కాదని, ఆర్థిక సమస్యలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బరంపురంలో ఆధ్యాత్మిక శోభ



పూజలందుకుంటున్న నర్సింహస్వామి

బరంపురం: నగర శివారు చందన్ పహడ్ సుకుండాలోని నర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉదయం 4 గంటల నుంచే ఆలయం భక్తుల సందడితో కిక్కిరిసింది. ఈ నేపథ్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, స్వామివారికి మహాహారతి, రాత్రి తిరువీధి కార్యక్రమం, పవళింపు సేవ నిర్వహించారు.

930 కిలోల గంజాయి స్వాధీనం



ఎక్సైజ్ అధికారుల అదుపులో నిందితుడు, గంజాయి

బరంపురం: నగరానికి సమీపంలోని మౌరి కాళువా ఘాట్ రోడ్డు నుంచి బరంపురానికి వ్యానులో అక్రమంగా రవాణా చేస్తున్న 930కిలోల గంజాయిని బరంపురం ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. ఎక్సైజ్ అదనపు కమిషనర్ రాజేంద్రకుమార్ పాత్రో అందించిన సమాచారం ప్రకారం దిగపండి పోలీసు స్టేషన్ పరిధి మౌరి కాళువా ఘాట్ రోడ్డు నుంచి బరంపురం నగరానికి వ్యానులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ అధికారులు మార్గం మధ్యలో రెక్కీ నిర్వహించి, వాహనాలను తనిఖీ చేశారు. అటుగా వస్తున్న వ్యానుపై దాడి చేయగా, 930కిలోల గంజాయిని సీజ్ చేయడంతో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ మార్కెట్‌లో సుమారు రూ.44 లక్షల విలువ ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆదివాసీ ఉన్నతికి కృషి



మాట్లాడుతున్న రబినారాయణ నందో

జయపురం: ఆదివాసీ ప్రజల ఉన్నతి, సంక్షేమానికి సీఎం నవీన పట్నాయక్ కృత నిశ్చయంతో ఉన్నారని, దీనికోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని మాజీ మంత్రి రబినారాయణ నందో తెలిపారు. నియోజకవర్గం లోని రొండాపల్లి గ్రామంలో బీజేడీ పార్టీ శనివారం నిర్వహించిన ఆదివాసీ సెల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పంచాయతీ మాజీ సర్పంచ్ త్రినాథ్ ముదులి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జయపురం విదానసభ పరిధిలో ఆదివాసీ ప్రజలే కీలక భూమిక నిర్వహిస్తున్నారని తెలిపారు.



బొడొ దండొ చేరిన కలప దుంగలు



సంప్రదాయ శ్రీకారం

- పూరీ జగన్నాథుని రథాల నిర్మాణానికి కలప రవాణ ప్రారంభం
- తొలి విడతలో 104 దుంగలు సరఫరా చేసిన నయాగడ్ అటవీశాఖ
- శ్రీపంచమి సందర్భంగా తొలిపూజ చేయనున్న భొయి సేవకులు
- శ్రీరామ నవమి నుంచి కలప కోత, పనులు ఆరంభం

భువనేశ్వర్: ఏటా వైభవంగా జరగనున్న విశ్వవిఖ్యాత జగన్నాథుని రథయాత్ర హడావుడి ప్రారంభమైంది. స్వామియాత్రలో రథాల తయారీ అత్యంత కీలక, భారీ ఘట్టం. ఆలయ సంప్రదాయాలకు ఏమాత్రం భంగం కలిగించకుండా అంతా క్రమ పద్ధతిలో తూచా తప్పకుండా ఈ భారీ ప్రక్రియ నిర్వహిస్తారు. ఆలయ పంచాంగం లెక్కల ప్రకారం రథాల నిర్మాణం ఆరంభం, పూర్తి చేయడం జరుగుతుంది. అడుగడుగున జగన్నాథుని ఆజ్ఞతో ఒక్కో దశ పనులకు శ్రీకారం చుడతారు. ఏటా యాత్రకు వినియోగించే కలప రవాణా శ్రీపంచమి(సరస్వతి పూజ) తిథి నుంచి శ్రీరామ నవమి నాటికి పూర్తి చేస్తారు. రథాల తయారీకి బొడొ దండొ చేరిన కలప దుంగలకు శ్రీపంచమి రోజు తొలి పూజలు నిర్వహిస్తారు. అనంతరం రామనవమి పురస్కరించుకుని కలప కోత లాంఛనంగా ప్రారంభిస్తారు. అక్షయ తృతీయ పురస్కరించుకుని రథాల నిర్మాణం అంకురార్పణ నిర్వహిస్తారు. తదనుగుణంగా నయాగడ్ అటవీ ప్రాంతం నుంచి కలప దుంగలు శనివారం రాత్రి స్వామి క్షేత్రానికి చేరాయి.



ట్రక్కుల్లో తరలివస్తున్న కలప

అడుగడుగునా ఉత్సాహమే..

భక్త జనంలోకి స్వామి తరలివచ్చే సమయం ఆసన్నమవుతుందని కలప రవాణా సంకేతం జారీ చేసింది. ఈ సంకేతం లభించడంతో భక్తజనంలో ఉత్సాహం ఉరకలేస్తుంది. నయాగడ్ అటవీ ప్రాంతం నుంచి ట్రక్కుల్లో కలప రవాణా ప్రారంభం కావడంతో పాలిమేర దసపల్లా ప్రాంతం మహావీర్ ఆలయం ఆవరణలో ఈ వాహనాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా సరిహద్దు దాటే ముందు నయాగడ్ పాతబస్తీలోని జగన్నాథ దేవాలయం వద్ద మరోసారి పూజాదులు నిర్వహించి శ్రీక్షేత్రానికి వీడ్కోలు పలికారు. ఈ పూజాదుల్లో స్థానిక ఎమ్మెల్యే రమేష్‌చంద్ర బెహరా, ఏసీఎఫ్ శ్వేతాలి సాహు, జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్ఓ) నిఖిలేష్ మల్లిక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రథసంహిత ఆధారం..

రథసంహిత ప్రకారం చతుర్ధా మూర్తుల రథ యాత్రకు ఏటా నయాగడ్ అటవీశాఖ కలప దుంగలు సరఫరా చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ప్రాచీన సంప్రదాయం ప్రకారం, సరస్వతి పూజకు ముందు పూరీ రథ నిర్మాణశాల ప్రాంగణానికి తొలిదశ రథ కలప చేరడం నియమంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జగన్నాథుని ప్రసిద్ధ నవ దిన యాత్రకు రథాల తయారీకి నయాగడ్ అటవీశాఖ దస్పల్లా అటవీ ప్రాంతం నుంచి ఏటా కలప సరఫరా చేస్తోంది. ఈ ఏడాది 747కలప దుంగలు సరఫరా చేయాలని శ్రీమందిరం పాలనా విభాగం అభ్యర్థించింది. ఇందులో 406 దుంగలు ఖంటస్ మిల్‌కు, 341 దుంగలు శ్రీమందిరం సింహద్వారం ఆవరణ బొడొ దండొలో ఏర్పాటు చేసే రథ నిర్మాణశాల ప్రాంగణానికి తరలించాలని సూచించింది.

వన దేవతకు పూజలు..

రథాల్లో స్వామియాత్రకు అనుకూలంగా ఉండే నాణ్యమైన కలపను ప్రత్యేక బృందం గుర్తించి ఖరారు చేస్తోంది. ఈ సందర్భంగా నయాగడ్ అటవీ విభాగం గొణియా ప్రాంతంలో నెలకొన్న వనదేవత బొడొ రౌశోకు ప్రత్యేక పూజాదులు నిర్వహించడం సంప్రదాయం. కలప గుర్తింపు కోసం జగన్నాథుని ఆజ్ఞగా పొందిన గీతగోవింద పట్టు వస్త్రం, ఆజ్ఞా మాల, స్వామి ప్రసాదాలను వన దేవతకు నివేదించి, పూజలు చేపడతారు. నయాగడ్ అటవీ ప్రాంతంలో అణువైన కలప దుంగలను ఖరారు చేసేందుకు రథ నిర్మాణ సూపర్‌వైజర్ సుదర్శన్ మేకప్, భొయి సేవకుల అధిపతి రబీభొయి, అమీన్ లక్ష్మణ్ మహాపాత్రతో కూడిన నిపుణుల బృందం గత నెలలో నయాగడ్ అటవీ ప్రాంతాన్ని సందర్శించింది.

అంచెలంచెలుగా తరలింపు..

రథ్ సీనియర్ కేర్‌టేకర్ సుదర్శన్ మేకప్ మాట్లాడుతూ మొదటి దశలో 3 ట్రక్కుల్లో 104 కలప ముక్కలలో 33 ఆసన్, 71 ధౌరా దుంగలు ఉన్నాయి. ఇందులో 12 అడుగుల ఆసన్ కలప 18 ముక్కలు, 20 అడుగుల ఒణొసా కలప 15 ముక్కలు ఉన్నాయి. అదేవిధంగా 12 అడుగుల పొడవైన చెక్కతో 44 ముక్కలు, 20 అడుగుల పొడవైన చెక్కతో 27 ధవురా ముక్కలు ఉన్నాయి. ఇది రథ కలప మొదటి దశ కాగా మిగిలిన కలప క్రమంగా వస్తుందని సుదర్శన్ తెలిపారు. ఈ కలపకు ఈనెల 26న శ్రీపంచమి పురస్కరించుకుని శ్రీమందిరం కార్యాలయం ఎదుట మూడు రథాల నిర్మాణం సంకల్పంతో ప్రధాన దుంగలకు పూజలు నిర్వహిస్తారు. మిగిలిన కలప దశల వారీగా వస్తుందని వివరించారు.



రథ నిర్మాణాలకు అనువైన కలపను గుర్తించిన నిపుణుల బృందం

ఏటా కొత్త రథాలు..

ఏటా కొత్తగా నిర్మించే 3 రథాల్లో జగన్నాథుడు తోబుట్టువులతో కలిసి యాత్ర చేపడతాడు. వీరికి తోడుగా సుదర్శనుడు ఈ యాత్రలో పాలుపంచుకుంటాడు. రథాల తయారీల 3 రకాల నాణ్యమైన కలప వినియోగిస్తారు. వీటిలో ఆసన్, ధవురా, ఫాసీ రకాలు ఉంటాయి. సమగ్రంగా 865 లాగ్(భారీ కలప దుంగలు) ఉపయోగిస్తారు. గత ఏడాది తెప్పించిన కలపలో 118 చెక్కలు మిగిలి ఉన్నాయి. ఈ లెక్కన ఈ ఏడాది రథాల తయారీకి 747 ఆసన్, ధవురా, ఫాసీ కలప దుంగలు అవసరం.

రోడ్డు భద్రతపై అవగాహన

భువనేశ్వర్:

ఖుర్దారోడ్ సంభావన స్వచ్ఛంద సేవాసంస్థ రహదారి భద్రత చైతన్య కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి దేవప్రసాద్ దాస్ సారథ్యం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జట్నీ ఠాణా పోలీసు అధికారి సౌమ్యకాంత బలియార్ సింఘ్ ముఖ్య అతిథిగా పాల్గొని, కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం ప్రయోజనాలు తదితర చైతన్య సమాచారంతో వాహనదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక వృద్ధ రిక్షా కార్మికుడు దామోదరరావును ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పురప్రముఖులు పాలుపంచుకున్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రాణహాని నుంచి తప్పించవచ్చని పిలుపునిచ్చారు.



జట్నీ మసీదు ఛక్ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సాయమందించాలని వినతి

మల్కన్‌గిరి:

అనారోగ్యంతో బాధ పడుతున్న తనకు ప్రభుత్వం తరపున సాయం అందించి, ఆదుకోవాలని జిల్లా కేంద్రంలోని 4వ వార్డుకు చెందిన మహిళ వై.గుణ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. క్యాన్సర్ సోకినట్లు వైద్యులు తెలిపారని, చికిత్స కోసం కటక్ వెళ్లేందుకు డబ్బులు లేవని వాపోయారు. అధికారులే చొరవ చూపాలని విన్నవించారు.



తన అనారోగ్య సమస్యను వివరిస్తున్న మహిళ

రాయగడ అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న మంత్రి ప్రమీల, వేదికపై కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు



కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

- రెవెన్యూ శాఖ మంత్రి ప్రమీలా మల్లిక్

రాయగడ: పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న రాయగడ భవిష్యత్‌లో మరింత అభివృద్ధికి మార్గం సుగమమైందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ప్రమీలా మల్లిక్ అన్నారు. పట్టణంలోని జైపూర్ షుగర్ కంపెనీ ఆధీనంలో ఉన్న సుమారు 506 ఎకరాల స్థలం ప్రభుత్వ హస్తగతం కావడంపై స్థానిక నాగరిక మంచ్ అశోక్ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని ప్రముఖులు, జిల్లా యంత్రాంగం, రాజకీయ నాయకుల కృషి ఫలితంగా ఈ స్థలం జిల్లా యంత్రాంగం పరిధిలోకి వచ్చిందని తెలిపారు. ఇకపై ఆ స్థలంలో సరైన ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి చేయడమే తరువాయి అని, దీనికి రాష్ట్రప్రభుత్వం కూడా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న రాయగడకు ఇదో సువర్ణ అవకాశమన్నారు. నిధులు ఉన్నా దీనికి అనుకూలమైన వాతావరణం, స్థలం లేకపోతే అభివృద్ధి సాధ్యపడదని, ఇకపై పట్టణ ప్రజలకు ఆ సమస్య ఉండదని పేర్కొన్నారు. మంచి ఆలోచనలు ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదిలి, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి తదితరులను నాగరిక మంచ్ సభ్యులు సన్మానించారు.


క్రీడలతో స్నేహభావం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినీపతి

జయపురం: క్రీడల పోటీలతో క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు నెలకొల్పుకోవాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సూచించారు. జయపురం సమితి పుపుగాం పంచాయతీ పూజారిపుట్‌లో అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సర్వ సాధారణమని, వాటిని స్ఫూర్తిమంతంగా స్వీకరించాలని తెలిపారు. నేటి ఓటమి రేపటి విజయానికి తొలి మెట్టు కాగలదని, క్రీడాకారులు ఎప్పటికప్పుడు తమ ప్రతిభను మెరుగు పరుచుకోవాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. జొడాపుట్, జానిగుడ గ్రామాల మధ్య ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జానిగుడ జట్టు విజయం సాధించింది. విజేతతో పాటు రన్నరప్ జట్టుకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. అంతకుముందు పూజారిపుట్ గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయ డ్యాన్సులు, వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. వారితో జత కలిసిన తారాప్రసాద్.. గ్రామస్తులను ఉత్సాహ పరిచారు.



గ్రామస్తులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే

గో సేవలో సీఎం



గోవులకు దాణా అందజేస్తున్న సీఎం



జమ్ముకొలి గోశాలలో దాణా సామగ్రి పరిశీలిస్తున్న దృశ్యం



దూడకు నామకరణం చేస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నగర శివారులోని జమ్ముకొలి గోశాలను ఆదివారం సందర్శించారు. భువనేశ్వర్ నగరపాలక సంస్థ(బీఎంసీ) నిర్వహిస్తున్న ఈ గోశాలలో గోవుల సంరక్షణ, దాణా తదితర కార్యకలాపాలను ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 3 రోజుల క్రితం జన్మించిన దూడకు కృష్ణ అని పేరు పెట్టారు.

-భువనేశ్వర్

క్లుప్తంగా

రేపు జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శాప్ ఆదేశాల మేరకు జిల్లాస్థాయి సీఎం కప్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ ఈ నెల 24న నిర్వహిస్తున్నట్టు డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత ఆదివారం తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా పురుషులు, మహిళలకు కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, బాక్సింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. టేబుల్‌టెన్నిస్ పోటీలు పీఎన్‌కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్ వేదికగా జరుగుతాయని పేర్కొన్నారు.

అరసవల్లి చేరిన అమరావతి ఉద్యమ నేత తిరుపతిరావు

అరసవల్లి: అమరావతి జేఏసీ నేత గద్దె తిరుపతిరావు ఆదివారం ఉదయం శ్రీకాకుళం జిల్లా అరసవల్లికి చేరుకున్నారు. ఈయనకు స్థానిక జిల్లా టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గుండ లక్ష్మీ దేవి తదితరులు స్వాగతం పలికారు. ఆదిత్యుడిని దర్శించుకుని అనంతరం విలేకరులతో మాట్లాడారు. అమరావతి–అరసవల్లి పేరిట పాదయాత్రను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుందని, అక్కడి నుంచి తాను ఒక్కడినే పాదయాత్రగా అరసవల్లి చేరుకుని మొక్కు చెల్లించుకున్నానని తెలియజేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజలు అమరావతిని కోరుతున్నారని, అలాగే అనుభవమైన నేతను ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే అమరావతికి మద్దతు పలుకుతున్న స్థానిక టీడీపీ నేతలపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ నడక పోటీల విజేతకు సత్కారం



సుధాకర్‌కు సన్మానిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అంతర్జాతీయ నడక పోటీల్లో పతకాలు సాధిస్తున్న శ్రీకాకుళం నగరానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు సంజీవిని నళిని సుధాకర్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేయాలని తీర్మానం చేసినట్లు శ్రీకాకుళం వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పేర్కొన్నారు. శ్రీలంక దేశంలోని కొలంబో నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన 36వ అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఐదు కిలోమీటర్లు నడక విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన సుధాకర్‌కు ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ సంస్థల చీఫ్ కో–ఆర్డినేటర్ పి.జి.గుప్తా మాట్లాడుతూ మార్చిలో ఒడిశా రాష్ట్రం బరంపురంలో జరగనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశాల్లో సుధాకర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎస్‌పీఎఫ్ డీజీపీ



మెహ్రాకు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ ఎస్‌పీఎఫ్ డీజీపీ సంతోష్ మెహ్రా ఆదివారం దర్శనాన్ని చేసుకున్నారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. సూర్యనమస్కార పండితుడు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఆదిత్యుని దర్శనం అద్భుతమని మెహ్రా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట వన్‌టౌన్ సీఐ నాయుడు తదితరులు ఉన్నారు.

వ్యసనాలకు బానిసై యువకుడు ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ తెప్పరేవుకు చెందిన కోరాడ రాజు (22) వ్యసనాలకు బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు స్వగ్రామం సంతకవిటి మండలం ఎస్.అగ్రహారం. కొన్నాళ్లుగా తెప్పరేవులోని తాత ఇంటి వద్ద ఉంటున్నాడు. శ్రీకాకుళం పట్టణంలోని కిన్నెర కాంప్లెక్స్ థియేటర్‌లో పని చేస్తున్నాడు. ఇటీవలే టికెట్ కౌంటర్ నుంచి రూ.30 వేలు వాడుకున్నాడు. దీనికితోడు మద్యం, బెట్టింగులకు అలవాటు పడటం, అప్పులు, ఆర్థిక ఇబ్బందుల వల్ల మానసిక సంఘర్షణకు గురై ఈ నెల 20న కలుపు నియంత్రణ మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం రూరల్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యతోనే వికాసం సాధ్యం

- కొరాపుట్ కేంద్రీయ విద్యాలయం వీసీ చక్రదేవ్ త్రిపాఠి
- నాలుగో రోజుకు చేరుకున్న చొయితి ఉత్సవాలు



కథకళి నృత్యంలో విద్యార్థి అభినయం



కోయ నృత్యంతో ఆకట్టుకుంటున్న యువతులు



ప్రసంగిస్తున్న వైస్ ఛాన్సలర్ చక్రదేవ్ త్రిపాఠి

రాయగడ: విద్యతోనే వికాసం సాధ్యపడుతుందని కొరాపుట్ కేంద్రీయ విశ్వవిద్యాలం వైస్ ఛాన్సలర్ డాక్టర్ చక్రదేవ్ త్రిపాఠి పేర్కొన్నారు. పట్టణంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం సాయంత్రం నాలుగో రోజు జరిగిన చొయితి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం సస్యశ్యామలంగా, సమృద్ధిగా ఎదగాలంటే ప్రతిఒక్కరూ ఉన్నత విద్యావంతులు కావాలని సూచించారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతం గతం కంటే మెరుగుపడిందని తెలిపారు. ఆధునిక విద్యావిధానానికి శ్రీకారం చుట్టిన రాష్ట్రప్రభుత్వం 5టీ పథకంలో ఉన్నత పాఠశాలలను ఆధునీకరించడం, ఉన్నత ప్రమాణాలను విద్యార్థులకు అందించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. అలాగే రాష్ట్రంలో ఎంతోమంది ప్రతిభ గల కళాకారులు ఉన్నారని, చొయితి వంటి ఉత్సవాలు వారిలోని కళా నైపుణ్యానికి పదునుపెట్టే విధంగా దోహదపడతాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. సరైన వేదికలు, అవకాశాలు లేకపోవడంతో ఎంతోమంది ప్రతిభ కనుమరుగవుతోందన్నారు. రాష్ట్రంలోని ఆదివాసీల భాషా, సంస్కృతి, ఆచార వ్యవహారాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని వివరించారు.

పారిశ్రామికంగా రాష్ట్రాభివృద్ధి

గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రం పారిశ్రామికంగా గణనీయమైన ప్రగతి సాధిస్తోందని కాసీపూర్ లోని ఉత్కళ అలూమిన కర్మాగారం యూనిట్ హెడ్ మజ్హర్ బేగ్ అన్నారు. చొయితి ఉత్సవాలకు ఆయన గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. రాయగడ వంటి జిల్లాలో జేకే, ఇంఫా, ఉత్కళ అలూమిన కర్మాగారాలు ఉన్నాయని, త్వరలో కాసీపూర్‌లో మరికొన్ని బృహత్తర పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. వాటిని స్వాగతించడం మన కర్తవ్యమని ఆకాంక్షించారు. కర్మాగారం ఏర్పాటుతో పరిసర ప్రాంతాల్లో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జేకే పేపర్‌మిల్ ఉపాధ్యక్షుడు వినయ్ ద్వివేది, తెరువలి ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లాయిస్(ఇంఫా) కర్మాగారం ఉపాధ్యక్షుడు ఆశీష్‌కుమార్ రాయ్ తదితరులు ప్రసంగించారు.

కవితా సంకలనం ఆవిష్కరణ..

ప్రముఖ రచయిత, కవి మహాశ్వేత పాణిగ్రాహి రచించిన 'ముతాయి సాపానొ' కవితా సంపుటిని చొయితి వేదికపై జరిగింది. అతిథులు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. చొయితి వంటి కార్యక్రమాలు ఇటు కళాకారులను ప్రోత్సహించడంతో పాటు రచయితలకు సముచిత స్థానాన్ని కల్పించడం హర్షించదగ్గ విషయమని వక్తలు అభిప్రాయపడ్డారు.

ఆకట్టుకున్న కథకళి నృత్యం

చొయితి నాలుగో రోజు ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన ఆదివాసీ నృత్యాలు అందరినీ ఆకర్షించాయి. బిసంకటక్, రాయగడకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన కేరళ ప్రసిద్ధి కథకళి నృత్యం అందరినీ మెప్పించింది. అలాగే కోయ, లోక్ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్ ప్రవచనాలు భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి.



కొరాపుట్ నృత్య బృందానికి బహుమతి అందిస్తున్న మజూర్ బేగ్

కొత్త సూర్య దేవాలయం నిర్మాణానికి సన్నాహాలు

- రెసిడెంట్ కమిషనర్‌కు అభ్యర్థన



కోణార్క్ ఆలయం

భువనేశ్వర్: కోణార్క్‌లో కొత్త సూర్య దేవాలయం నిర్మాణానికి సన్నాహాలు ఊపందుకున్నాయి. న్యూ కోణార్క్ సన్ టెంపుల్ కనస్ట్రక్షన్ సంస్థ ఈ ఉద్యమానికి నడుం బిగించింది. ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపు ప్రక్రియలో తలమునకలై ఉంది. అయితే దీనిపై రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా స్పందించక పోవడంతో ఈ వర్గం ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్‌తో సంప్రదింపులు చేపట్టింది. 'న్యూ కోణార్క్ సన్ టెంపుల్ కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్' అధ్యక్షుడు ముఖేష్ జైన్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు స్థలం కేటాయింపు కోసం ఒడిశా ముఖ్యమంత్రి, గవర్నర్‌కు ఉద్దేశించిన వినతిపత్రం రెసిడెంట్ కమిషనర్‌కు అందజేశారు. కొత్త సూర్య దేవాలయం ఏర్పాటుకు స్థానిక యంత్రాంగం సహకరించడం లేదని ఆరోపించారు. ఆలయ నిర్మాణానికి 6 ఎకరాల స్థలం అవసరమని పేర్కొన్నారు. దీనిపై సంస్థ కార్యకర్తలు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో సంప్రదించనున్నట్లు తెలిపారు.

కాలువలో యువకుడి మృతదేహం లభ్యం



కాలువలో తేలియాడుతున్న యువకుడి మృతదేహం



ఓడ్రాఫ్ బృందం బయటకు తీసిన రామకృష్ణ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం 14వ వార్డు వద్ద ఉన్న కాలువలో శనివారం ఉదయం నీటిలో తేలియాడుతున్న ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఐఐసీ రీగాన్ కీండో సిబ్బంది, ఓడ్రాఫ్ బృందం సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. దర్యాప్తు చేయగా, అదే వార్డుకు చెందిన రామకృష్ణ గండ(28) అని తేలింది. తల్లిదండ్రులను పిలిచి విచారించగా, గత కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధ పడుతున్నట్లు తెలిపారు. కాలువ వద్దకు వెళ్లిన సమయంలో వ్యాధికి గురై, మృతి చెందినట్లు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.

సెమీస్‌కు హైదరాబాద్, జయపురం



ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న పోలీసు అధికారి

జయపురం: జయపురం స్వయంపాలిత విక్రమదేవ్ కళాశాల క్రీడా మైదానంలో సన్నీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీ–20 అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో జయపురం, హైదరాబాద్ జట్లు సెమీ ఫైనల్ దశకు చేరుకున్నాయి. ఈ మేరకు రెండు జట్లలో గెలుపొందిన జట్టు ఫైనల్‌కు చేరుకోనుంది. అంతకుమందు జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో టాస్ గెలిచిన సన్నీ క్రికెట్ క్లబ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన జయపురం ఓరియన్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. ఆదిత్య రౌత్ 33 బంతుల్లో 67 పరుగులు, చంద్రశేఖర్ 35 బంతుల్లో 51 పరుగులతో రాణించారు. అనంతరం 182 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన సన్నీ జట్టు.. 19 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 184 పరుగులు చేసింది. ఈ టీమ్‌లో గౌరీశంకర్ 58 బంతుల్లో 73 పరుగులు చేయగా, కిరణ్ 34 బంతుల్లో 7 పరుగులు చేసి జటు విజయానికి దోహపడ్డారు.

యుగపురుషుల మార్గం అనుసరణీయం



సత్సంగ విహార్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: మానవాళిపై కరుణ, ప్రేమ, దయామార్గాలు చూపాలన్న యుగపురుషులు మాటలు అనుసరణీయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఈదుపురం సత్సంగ్ విహార్‌లో ఆదివారం ఠాకూర్ అనుకూలచంద్ర ఠాగూర్ 135వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రవచనాలతో ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది శిష్యులను సంపాదించుకున్న అనుకూల చంద్ర ఠాగూర్ పూజ్యునీయులని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న 11వ సత్సంగ్ విహార్ ప్రతిష్ఠ స్మృతి మహోత్సవానికి అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన శిష్యులు, భక్తులు ధన్యులని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, దుక్క ధనలక్ష్మీ, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, బొనమాళి బెహరా, ఎంపీటీసీ నర్తు ప్రేమ్‌కుమార్, రాంపత్ని చిట్టిబాబు, ఆశి కృష్ణారెడ్డి, పిట్ట మామయ్య, ఉప్పాడ రాజారెడ్డి, ఇసురు తులసీరాం పాల్గొన్నారు.

ఆర్డీఓ అనుమతి పత్రంతోనే వీఐపీ టికెట్లు



వి.హరిసూర్యప్రకాష్, ఈఓ



అరసవల్లి: రథసప్తమి మహోత్సవం సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో వీఐపీల దర్శనాలకు ఈ ఏడాది నుంచి ప్రత్యేకంగా రూ.500 టిక్కెట్ల విక్రయాలను ఈనెల 24 నుంచి అందుబాటులోకి ఉంచుతున్నట్లుగా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రకటించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర దేవదాయ శాఖ ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు వీఐపీలకు కూడా ప్రత్యేక టిక్కెట్లు కొనుగోలు చేసుకునేలా చర్యలు చేపట్టినట్లుగా వివరించారు. అయితే ఈ టిక్కెట్లు పొందాలంటే శ్రీకాకుళం రెవెన్యూ డివిజినల్ అధికారి (బొడ్డేపల్లి శాంతి) నుంచి అనుమతి పత్రం ఉండాలని, ఈ పత్రాన్ని చూపించి, అరసవల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో రూ.500 చెల్లించి ఒక్కో వీఐపీ టిక్కెట్టును కొనుగోలు చేసుకోవాలని, వీటిని ఈనెల 24 నుంచి బ్యాంకులో అందుబాటులో ఉంటాయని, ఒక వీఐపీ టిక్కెట్టుతో ఇద్దరికి మాత్రమే విశిష్ట దర్శనానికి అనుమతివ్వనున్నట్లుగా ఆయన తెలియజేశారు. వీవీఐపీలకు ప్రోటోకాల్ ప్రాప్తికి నేరుగానే స్వామి వారి దర్శనం ఉంటుందని.. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

పాసుల పంపిణీకి చర్యలు

రథసప్తమికి కీలకమైన డోనర్ పాసులు (దాతలు)ను ఈనెల 25, 26, 27వ తేదీల్లో స్థానిక ఆలయ కార్యాలయం వద్దనే ప్రత్యక్షంగా దాతలకు లేదా ఆయా దాతల సూచన మేరకు వారి సంబంధీకులకు మాత్రమే అందజేస్తామని ఆలయ ఈవో తెలిపారు. సోమవారం నుంచి ఆలయ సిబ్బందిచే మొత్తం దాతలందరికీ పాసుల పంపిణీకి సంబంధించిన సమాచారాన్ని ఫోన్‌లో సమాచారం అందజేస్తామని వివరించారు. అలాగే ఈనెల 26వ తేదీలోగా రూ.లక్ష లేదా అంతకుమించి విరాళాలిచ్చిన వారికి గడువు విధిస్తున్నామని, వీరికి కూడా దాతల పాసులను అందజేస్తామన్నారు. ప్రతి ఏడాదిలాగానే ఆలయ దాతలు తమ విరాళ రశీదుతో ఆలయ కార్యాలయాన్ని సంప్రదిస్తే ఈనెల 27లోగా దాతల పాసులను నేరుగా పొందవచ్చునని ఈఓ ప్రకటించారు.

సంద్రంలోకి ఆలివ్ రిడ్లే తాబేళ్లు



తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న అటవీ శాఖాధికారులు

సోంపేట: అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బట్టిగళ్లూరు వద్ద ఆదివారం ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలో విడిచి పెట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ బట్టి మాధవరావు, బారువ సెక్షన్ అధికారి విజయ సారధి మాట్లాడుతూ అరుదైన జీవజాతులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉందన్నారు.

ముఖ్యంగా ఆలివ్‌రిడ్లే తాబేళ్లను సంరక్షించడానికి మత్స్యకారులు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో బారువ బీట్ అధికారి టి.సంతోష్, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్‌గేమ్స్

అథ్లెటిక్స్ పోరు



బాలుర 100 మీటర్ల పరుగు పందెంలో దూసుకెళ్తున్న అథ్లెట్స్

- హోరాహోరీగా సాగిన ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్–19 అథ్లెటిక్స్ పోటీలు
- విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాల అందజేత



వ్యక్తిగత చాంపియన్లుగా నిలిచిన అథ్లెట్స్‌కు ట్రోఫీలను అందజేస్తున్న డీఈఓ జి.పగడాలమ్మ, పరిశీలకులు రంగారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగిన ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. అండర్–14, అండర్–17 బాలబాలికల పోరు 21నే ముగియగా.. అండర్–19 విభాగంలో బాలబాలికలకు ఆదివారం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖపట్నం, వైఎస్సార్ కడప, తూర్పుగోదావరి, నెల్లూరు, శ్రీకాకుళం, గుంటూరు, ప్రకాశం జిల్లాల క్రీడాకారులు సత్తాచాటారు. 66వ ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్–19 అథ్లెటిక్స్ పోటీల్లో వ్యక్తిగత విభాగాల్లో చాంపియన్లుగా బాలురు విభాగంలో బి.హేమతేజ (నెల్లూరు)828 పాయింట్లతో, బాలికల విభాగంలో ఎం.మానస (గుంటూరు) 664 పాయింట్లతో నిలిచి బహుమతులు అందుకున్నారు.

జాతీయ పోటీలకు సన్నద్ధం కండి: డీఈఓ

రాష్ట్రపోటీల్లో చూపించిన పోరాట ప్రతిభతో జాతీయ పోటీలకు సన్నద్ధం కావాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షురాలు, డీఈఓ గార పగడాలమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ మాట్లాడుతు మూడు రోజుల రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణ, ఏర్పాట్లు, విశేషాలను వివరించారు. శ్రీకాకుళంలో మీట్ నిర్వహణ అత్యద్భుతంగా చేశారని, ఎలాంటి లోటుపాట్లు కనిపించలేదని మీట్ పరిశీలకులు టీవీఎస్ రంగారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పి. సుందరరావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, ఎం.ఆనంద్‌కిరణ్, టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.హరిబాబు, ఎం.తిరుపతిరావు, పి.తవిటయ్య, నారాయణరావు, నిర్మల్‌కృష్ణ, మాధురి, సుశీల, పీడీలు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారు.

ఇంతటి ఆతిథ్యం.. సిక్కోలుకే సాధ్యం

సిక్కోలు ఆతిథ్యాన్ని మరువలేమని మీట్‌కు హాజరైన క్రీడాకారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. పోటీల్లో దాదాపు 1800 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా మరో 120 మంది కోచ్ మేనేజర్లు హాజరయ్యారు. టెక్నికల్ అఫీషియల్స్ 100 మంది వరకు మీట్ నిర్వహణలో భాగస్వామ్యులయ్యారు. తమ సొంత మనుషుల్లా చూసుకున్నారని, ఇంతటి ఆతిథ్యాన్ని గతంలో ఎన్నడూ.. ఎక్కడా చూడలేదని తమ మనుసులో మాటలను 'సాక్షి'తో వ్యక్తం చేశారు.

కిటకిటలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్



శ్రీకాకుళం కాంప్లెక్స్‌లోని నాన్‌స్టాప్ పోర్టికో వద్ద ప్రయాణికుల రద్దీ

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి అనంతరం సెలవులు ముగియడంతో ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆదివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు పోటెత్తారు. పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష కూడా జరగడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీగా అభ్యర్థులు తరలిరావడంతో రద్దీగా కనిపించింది. దూరప్రాంత ప్రయాణికులు నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బారులు తీరారు. సాధారణ ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు వచ్చిన ఎక్కేందుకు ఎగబడ్డారు. ఉదయం నుంచే ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ పర్యవేక్షించారు.

26న వాసుదేవుని సన్నిధిలో శ్రీపంచమి వేడుకలు

మందస: మందస పట్టణంలోని శ్రీవాసుదేవపెరుమాళ్ స్వామి ఆలయంలో ఈ నెల 26న శ్రీపంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గతంలో ఇదే ఆలయంలో వేద అధ్యయన కేంద్రం ఉండేదని, ఇక్కడ చదువుకున్న వారు గొప్ప పండితులు అయ్యారన్నారు. ఇదే స్ఫూర్తితో ఉచిత అక్షరాభ్యాసన కార్యక్రమం కూడా వికాస తరంగిణి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను ఆలయం వద్ద ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9441869044, 9866060260 అనే నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

భారీగా మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్సై తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని వివిధ మద్యం షాపుల్లో కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయించేందుకు తరలిస్తున్న రూ.85,200ల విలువైన 552 మద్యం బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి స్థానిక ఐటీఐ కాలనీ వద్ద నిర్వహించిన తనిఖీల్లో మెట్టవలస గ్రామానికి చెందిన పువ్వల పైడిరాజు, కెల్ల రాములు ఆటోలో మద్యం బాటిల్స్ అక్రమంగా తీసుకువెళ్తూ పట్టుబడినట్లు ఎస్సై వి.జ్ఞానప్రసాద్ తెలిపారు. మద్యం బాటిల్స్‌తో పాటు తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి, నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కారు దగ్ధం



కోనేటి గట్టుపై దగ్ధమవుతున్న కారు

పాలకొండడ రూరల్: నగరపంచాయతీ పరిధి వడమ ప్రాంతంలో కల్యాణి కోనేటి గట్టుపై కొద్ది రోజులుగా పార్కింగ్‌లో ఉన్న కారు దగ్ధమైంది. ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్లుండి కారు నుంచి మంటలు, దట్టమైన పొగ వ్యాప్తి చెందడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను ఆపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు శకటంతో సహా ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ కారు ఎవరిదనే విషయం తెలియరాలేదు. ఘటనలో కారు పూర్తిగా కాలిపోయింది.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని రాజ్‌మహల్ కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు మరడాన మురళీకృష్ణ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. విశాఖలో చదువుకుంటున్న కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు కుటుంబసభ్యులు వెళ్లగా ఈ చోరీ జరిగినట్లు తెలిసిందని బాధితుడు విలేకరులకు తెలిపాడు. రెండున్నర కిలోల వెండి, నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్షా 40వేల నగదు పోయినట్లు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి పరిశీలించారు.

నాటుబండిని ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ దుర్మరణం



సూరిబాబు మృతదేహం

పూసపాటిరేగ: స్థానిక జాతీయరహదారి సర్వీసురోడ్డులో ఓ మోటార్ సైకిల్ నాటుబండిని వెనుక నుంచి ఢీకొని వాహన చోదకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పేరాపురం గ్రామానికి చెందిన శీలవలస సూరిబాబు(25) హెచ్‌బీఎల్ పరిశ్రమలో ఎస్ఎంఆర్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీ నిమిత్తం ఉదయం 5 గంటల సమయంలో పేరాపురం నుంచి పూసపాటిరేగ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మంచుకారణంగా ముందు ఉన్న నాటు బండి కనిపించకపోవడంతో మోటార్‌సైకిల్‌తో బలంగా ఢీకొనడంతో ఛాతీకి తీవ్రగాయమై మృతి చెందాడు. మృతుడికి తల్లి లక్ష్మి ఉంది. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ హరిఅప్పారావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

తెర్లాం: మండలంలోని వెలగవలస సమీప మామిడి తోటలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి సంబంధించి స్థానిక పోలీసులు నమోదు చేసిన హత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నెల 16న వెలగవలసలోని మామిడి తోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. ఎస్పీ ఎం.దీపికా పాటిల్ ఆదేశాల మేరకు బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు దర్యాప్తు ప్రారంభించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్య సిరులు



- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- విజయనగరంలో రాష్ట్ర స్థాయి మిల్లెట్ మహోత్సవం ప్రారంభం
- ఆకట్టుకున్న చిరుధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు



మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు

విజయనగరం:

చిరుధాన్యాలు ఎంతో ఆరోగ్యదాయకమని, వీటిని ప్రతీ ఒక్కరూ వినియోగించాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి మిల్లెట్ మహోత్సవం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో ఆదివారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ డి.ప్రవీణ్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఏపీఎఫ్‌పీఓ సీఈఓ శ్రీహరిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం చిరుధాన్యాలతో చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, వంటల ప్రదర్శన, విక్రయాలను 25 స్టాల్స్ ద్వారా ప్రారంభించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ చిరుధాన్యాలను సిరి ధాన్యాలుగా పేర్కొన్నారు. గతంతో పోలిస్తే మన ఆహార అలవాట్లలో మార్పు రావడం వల్ల, చిరుధాన్యాల వాడకం క్రమంగా తగ్గిపోయిందని అన్నారు. దీనివల్ల మధుమేహం, రక్తపోటు లాంటి వ్యాధులు పెరిగిపోయాయని చెప్పారు. గతంలో మాదిరిగా చిరుధాన్యాలను అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయానికి, రైతుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని, చిరుధాన్యాల సాగును, వినియోగాన్ని పెంచడానికి ఇదే తగిన సమయమని అన్నారు. చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేందుకు కృషి చేస్తున్న జిల్లా యంత్రాంగాన్ని కోలగట్ల అభినందించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం చిరుధాన్యాల వినియోగాన్ని పెంచాల్సి ఉందని స్పష్టం చేశారు. ఒక ప్పుడు బియ్యం కొరత ఎక్కువగా ఉండేదని, అప్ప ట్లో చిరుధాన్యాలను ఆహారంగా తీసుకొని, ప్రజలు ధృడంగా ఉండేవారని అన్నారు. కోవిడ్ తరువాత ప్రజల దృక్పథంలో మార్పు వచ్చిందని, చిరుధాన్యా ల వినియోగం కూడా పెరిగిందని చెప్పారు. జిల్లాలో చిరుధాన్యాల సాగును, మార్కెటింగ్ ప్రోత్సహించడానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. జిల్లాలో వరి తరువాత అధికంగా సాగయ్యే మొక్కజొన్న పంట కోసం మెరకముడిదాంలో మొక్కజొన్న ప్రాసెసింగ్ పరిశ్రమను ఏర్పాటు కానుందని చెప్పారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఎక్కువగా వినియోగించే మన పాత సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను మళ్లీ ఇప్పుడు మొదలు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. చిరుధాన్యాలను పెంచాలి, తినాలి, పంచాలని పిలుపునిచ్చా రు. పౌర సరఫరాల సంస్థ ద్వారా చిరుధాన్యాలను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందిస్తోందని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా రాగి అంబలిని పంపిణీ చేయా లని కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. చిరుధాన్యాలకు కూడా మద్దతు ధరను ప్రకటించిన ఏకైక రాష్ట్రం మనదేనని చెప్పారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఐక్యరాజ్య సమితికి చేసిన విజ్ఞప్తి మేరకు 72 దేశాల అంగీకారంతో ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం జరిగిందని చెప్పారు. ఇటీవల చిరుధాన్యాల ఆహార పదార్థాలతో పార్లమెంటులో విందు భోజనాన్ని కూడా ఏర్పాటు చేశారని తెలిపా రు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ మన పెద్దల ఆరోగ్యానికి చిరుధాన్యాలే కారణమని పేర్కొన్నారు. దీని కోసం ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలని స్పష్టం చేశారు. మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ డి.ప్రవీణ్ మాట్లాడుతూ ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటికి ప్రాచుర్యం కల్పించేందుకు 20 రాష్ట్రాల్లో మిల్లెట్ మహోత్సవాలను నిర్వహించనున్నామని చెప్పారు. మొదటి ఉత్సవం మధ్యప్రదేశ్‌లో జరిగిందని, దేశంలో రెండో ఉత్సవాన్ని, రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ఇప్పుడు విజయనగరంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏపీఎఫ్‌పీఓ సీఈఓ శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేందుకు, ప్రచార కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంలా నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాయని తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ కార్పొరేట్ రిలేషన్ ఆఫీసర్ గిరిధర్ మాట్లాడుతూ ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీస్ ద్వారా చిరుధాన్యాల ఉత్పత్తులను దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేయనున్నామని వెల్లడించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కూడా జరగబోతోందని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సిహెచ్.వెంకటలక్ష్మి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం స్థాపకులు కుమారస్వామి, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి త్రినాథస్వామి, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఏడీ జగన్నాథరావు, సీనియర్ సైంటిస్ట్ అనురాధ, ఏపీసీఏడీ జిల్లా మేనేజర్ ఎం.ఆనందరావు, ఆకాంక్ష తదితరులతో పాటు డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలతో చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, వంటల ప్రదర్శన, విక్రయాలను ప్రారంభిస్తున్న అతిథులు



మిల్లెట్ మహోత్సవం సందర్భంగా వివిధ రకాల చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన స్వాగత ముగ్గు



స్టాల్‌లో విక్రయాలకు ఉంచిన చిరుధాన్యాలతో చేసిన ఆహార ఉత్పత్తులు

రసవత్తరంగా సంగిడీల పోటీలు



సంగిడీల పోటీలో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న సత్యనారాయణ



సంగిడీల పోటీల్లో తృతీయ స్థానం దక్కించుకున్న త్రినాథ



సంగిడీల పోటీదారు వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సంతకవిటి: బాలఅన్నమ్మ పేరంటాలు జాతర పురస్కరించుకుని, మండలంలోని సురవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన సంగిడీల పోటీలు రసవత్తరంగా సాగాయి. సర్పంచ్ గంటా షణ్ముఖరావు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 12 మంది పాల్గొన్నారు. 130 కిలోల సంగిడీలు ఎత్తేవరకూ పోటీదారులు పోటాపోటీగా తలపడ్డారు. ఒప్పంగికి చెందిన గేదెల సత్యనారాయణ, తమ్మినాయుడుపేటకు చెందిన ముద్దా వెంకటేష్, చింతవానిపేటకు చెందిన ఆవాల వెంకటేష్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. తాలాడకు చెందిన వంకల ఆది ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. వీరికి వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జరిగిన 140 కిలోల ఉలవల బస్తా పోటీల్లో చింతవానిపేట చెందిన ఆవాల వసంత్ విజేతగా నిలవగా, అతడికి రూ.3 వేల నగదు బహుమతి అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పెదనడిపల్లి విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

చీపురుపల్లిరూరల్: మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన ఎ.అభిలాష్, జె.రవికిరణ్, యు.పవన్‌కుమార్, బాలికల విభాగంలో ఎం.పావని,బి.కృపాజ్యోతి, ఎం.భార్గవి, జి.లిఖిత, ఎం.హారిణిలు ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌కె.రహనా బేగం, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.రామారావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు

- స్కూల్‌గేమ్స్ పోటీల్లో 28 పతకాలు సాధించిన విద్యార్థులు



రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: ఈనెల 20, 21 తేదీల్లో శ్రీకాకుళంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14,17 విభాగాల్లో బాల, బాలికలకు జరిగిన పోటీల్లో 28 పతకాలు సాధించిన విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 5 బంగారు పతకాలు, 15 వెండి పతకాలు, 8 కాంస్య పతకాలను జిల్లా విద్యార్థులు సాధించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. ఈ జిల్లా విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

అండర్-19 స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



అండర్-19 కరాటే పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



రోప్ స్కిప్పింగ్ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో మూడు క్రీడాంశాల్లో ఆదివారం నిర్వహించారు. రోప్ స్కిప్పింగ్, ఫుట్‌బాల్, కరాటే క్రీడాంశాల్లో జరిగిన ఎంపిక పోటీలకు ఇంటర్మీడియట్ అభ్యసిస్తున్న విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారిలో రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ కృష్ణ తెలిపారు. అలాగే ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు తిరుపతి జిల్లా కేంద్రంలో గల ఎస్‌వీఆర్ట్స్ కళాశాలలో జరిగే పోటీలకు..కరాటే పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29న ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో జరిగే పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలను వ్యాయామ అధ్యాపకులు కె.తౌడుబాబు తదితరులు పర్యవేక్షించారు.

పోలిపల్లి పైడితల్లికి ప్రత్యేక పూజలు చేసిన జీఎంఆర్



ఆలయ అభివృద్ధి పనులపై జీఎంఆర్‌కు వివరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాజాం సిటీ: ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు(జీఎంఆర్) కుటుంబ సమేతంగా ఆదివారం స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకుడు సూర్యనారాయణశర్మ ఈ సందర్భంగా వారితో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సంబంధించిన వివరాలను ఈఓ బీవీ మాధవరావును జీఎంఆర్ అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల 26 నుంచి మూడు రోజుల పాటు అమ్మవారి వార్షిక జాతర నిర్వహించనున్నామని ఈఓ ఈ సందర్భంగా ఆయనకు తెలిపారు. అలాగే పోలిపల్లి అమ్మవారి దేవస్థానానికి సంబంధించి ఆర్చ్ నిర్మాణం చేపట్టాలని ఆలయ కమిటీ సభ్యులు జీఎంఆర్‌ను కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన అంచనాలు తయారుచేయాలని సూచించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో జీఎంఆర్ పీఏ ఆర్.అన్నంనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు వాకచర్ల రాజా, సలాది తులసీదాస్, సలాది మహేశ్వరరావు, వి.లక్ష్మణరావు, పెంకి చైతన్య తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం

- అలుగోలు చేరుకున్న కబడ్డీ క్రీడాకారులు



కబడ్డీ క్రీడాకారులకు సూచనలు అందిస్తున్న కోచ్ పతివాడ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 13 మంది బాలురు, 13 మంది బాలికల జట్లు ఆదివారం క్రీడా మైదానానికి చేరుకున్నాయి. వారికి నిర్వాహకులు వసతి, భోజన సౌకర్యాలు కల్పించారు. ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నట్లు కబడ్డీ అసోషియేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

అల్లూరి జిల్లాలో పులి బోను ఏర్పాటు

- పాడేరు డీఎఫ్ఓ వినోద్ కుమార్



పులిట్రాప్ కేజ్ (బోను)ను పరిశీలిస్తున్న పాడేరు డీఎఫ్ఓ వినోద్ కుమార్ తదితరులు

బొండపల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో పులి సంచారం ఎక్కువగా ఉన్నందున పులి ట్రాప్ కేజ్ (పులిబోను)ను ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పాడేరు డీఎఫ్ఓ వినోద్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని వన మిత్ర కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం ఆయన అటవీశాఖ అధికారులతో పాటు హైదరాబాద్ జూపార్క్ రిటైర్డ్ వెటర్నరీ జాయింట్ డైరెక్టర్‌తో పాటు విశాఖపట్నం నెహ్రూ జూపార్క్ వెటర్నరీ వైద్యాధికారితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వనమిత్ర కేంద్రంలో ఉన్న పులి బోనును పరిశీలించారు. జిల్లాలో ఉన్న బోను మాదిరిగానే త్వరలో తయారు చేసి పులిని సురక్షితంగా పట్టుకోవడానికి చర్యలు తీసుకోవాలనే క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు తెలిపారు. బొండపల్లి మండలంలోని వెదురువాడ,పాతపసలు పాడు ప్రాంతాల్లో పులి దాడి చేసి ఆవులను చంపిన ప్రాంతాలు పరిశీలించినట్లు తెలిపారు. అయా గ్రామాలకు కొద్ది కిలోమీటర్ల దూరంలోనే అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని అనంతగిరి మండలానికి చెందిన గిరిజన గ్రామాలు ఉన్నాయని చెప్పారు. పులి ఈ రెండు మండలాలకు చెందిన గిరిజన ప్రాంతాల్లోనే ఎక్కువగా సంచరిస్తున్నట్లు గుర్తించామని వివరించారు.

చెట్టును మినీ వ్యాన్ ఢీకొని ఒకరి మృతి



అల్లుబోయిన మల్లేశు మృతదేహం

వీరఘట్టం: ఒడిశా రాష్ట్రం రాయగడలోని మజ్జి గౌరమ్మను దర్శించుకునేందుకు వ్యాన్‌లో వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఆదివారం మధ్యాహ్నం వీరఘట్టం మండలం తూడి జంక్షన్ సమీపంలో ఓ చెట్టును వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మరణించగా మరో 8 మంది గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం యరకయ్యపేటకు చెందిన ఒకే కుటుంబ సభ్యులు 15 మంది శనివారం రాత్రి రాయగడ మజ్జి గౌరమ్మను దర్శించుకునేందుకు మినీ వ్యాన్‌లో పయనమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారిని దర్శించుకుని ఉదయం 9 గంటలకు వ్యాన్‌లో బయలుదేరి తిరిగి వస్తుండగా తూడి జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టును వ్యాన్ బలంగా ఢీ కొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న అల్లుబోయిన మల్లేశు(40) రోడ్డుపై పడడంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. అలాగే మరో 8 మందికి గాయాలు కావడంతో అందరినీ పాలకొండ ఏరియా ఆస్పత్రికి వైద్య కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లేశు తుదిశ్వాస విడిచాడు. మిగిలిన వారిని మెరుగైన వైద్య చికిత్సల కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.హరికృష్ణ తెలిపారు.

కొండచిలువ హతం



హతమార్చిన కొండ చిలువను చూపిస్తున్న గ్రామస్తుడు

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామ పంట కాలువ వద్ద సంచరిస్తూ కనిపించిన ఏడు అడుగుల పొడవైన కొండచిలువను స్థానికులు భయాందోళనతో హతమార్చారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే వారికి ఎటువంటి అపాయం లేకుండా ఉండేందుకే సర్పాన్ని చంపినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణం సమీపంలో సుమారు 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో ఆదివారం మృతిచెందాడు. మృతుడి ఎడమ చేతిపైన రాజ్ అని, కుడిచేతి వైపు శివుని త్రిశూలం సింబల్ పచ్చబొట్టు ఉందని, నీలం రంగు ట్రాక్, సర్ఫ్ కలర్ రౌండ్ నెక్ టీషర్ట్ ధరించి ఉన్నట్లు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఫోన్ 9666555214, 9490617089 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చికిత్సపొందుతూ బాలిక..



మృతిచెందిన బాలిక స్రవంతి

బాడంగి: తల్లిదండ్రులు తరచూ గొడవలు పడి తల్లి ఇల్లు విడిచి కన్నవారింటికి తన తమ్ముడితో కలిసి వెళ్లిపోవడాన్ని తట్టుకోలేక చీమలమందుతాగేసిన బాలిక విజయనగరం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జీకేఆర్‌పురం గ్రామానికిచెందిన ముద్దాడ స్రవంతి(15) బాడంగి కస్తూరిబా బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సంక్రాంతిసెలవులకోసం ఇంటికివెళ్లింది. తండ్రి లక్ష్మణరావు మద్యానికి బానిసై తాగుతుండగా తల్లి పార్వతి పండగరోజుల్లోనైనా పిల్లలతో సరదగా ఉండమని, తాగొద్దని హితవు పలికింది. కానీ లక్ష్మణరావు ఎప్పటిలాగానే తాగివచ్చి గొడవకు దిగడంతో భార్య, కుమారుడ్ని తీసుకుని ఈ నెల 18న సీతానగరం మండలం సూరంపేట వెళ్లిపోయింది. దీంతో స్రవంతి మనస్తాపానికి గురై చీమలమందు తాగేసింది. మృతురాలి తల్లి పార్వతి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ ఉమామహేశ్వరరావు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

రైలు కింద పడి మహిళ..



రైలు కింద పడి మరణించిన మహిళ

చీపురుపల్లి: చీపురుపల్లి రైల్వేస్టేషన్ వద్ద 30 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని మహిళ గూడ్సు రైలు కింద పడి మరణించినట్లు జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనువాసరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఫోన్ 7013273731 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామానికి చెందిన అల్లు రామారావు (28) చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతిచెందాడని ఏఎస్సై భాస్కరరావు ఆదివారం తెలిపారు. ఏఎస్సై తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రామారావు విశాఖపట్నంలో నివాసముంటూ తాపీమేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సంక్రాంతి పండగకు కుటుంబ సభ్యులతో స్వగ్రామం వచ్చాడు. రెండు రోజుల క్రితం ఒంట్లో నలతగా ఉండడంతో తల్లి పోలమ్మ ఇంటిమేడపై నిద్రకు ఉపక్రమించాడు. మరునాడు ఉదయం 9గంటల సమయంలో భార్య భాను టిఫిన్‌కోసం పిలిచేందుకు మేడపైకి వెళ్లగా అప్పటికే బాత్‌రూమ్‌లో పడిపోయి తలకు గాయాలతో కనిపించాడు. వెంటనే స్థానికుల సహాయంతో రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు శ్రీకాకుళం ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ 21న రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.